క్లుప్తంగా

ఆధార్ శీలాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నగరి: చింతలపట్టెడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ కృష్ణవేణి అధ్వర్యంలో నవచేతన ఆధార్‌శీలా పోషన్ బి-పఢాయి బి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. ఆరేళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారుల అభివృద్ధి నిర్ధారించడానికి, నూతన విద్యా విధానం ద్వారా చిన్నారుల ఆటపాటలతో పాటు విద్య నేర్పే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కీర్తిప్రియ, ఏఈ హేమకుమార్, సూపర్‌వైజర్లు శంకరమ్మ, శ్యామ, లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కేలు, ఆశాలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడండి

పుత్తూరు: మండల పరిధిలోని గట్టు వడ్డిండ్లు శ్మశాన స్థలం కబ్జాకు గురవుతోందని, దీనిని అడ్డుకోవాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ నేసనూరు లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 605లో వడ్డిండ్లకు చెందిన వంద కుటుంబాలు నివశిస్తున్నామని తెలిపారు. వందేళ్లుగా అనుభవించుకొంటున్న శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించుకొంటున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చెంగమ్మ, లీలావతి, నిర్మల, నవనీతమ్మ, కిష్టప్ప, బాల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో డీఎస్పీ తనిఖీలు



ఫ్యాక్టరీని తనిఖీ చేస్తున్న డీఎస్పీ

విజయపురం: మండలంలోని కోసలనగరం పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలను నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ తన సిబ్బందితో తనిఖీ చేపట్టారు. కార్మికుల భద్రత విషయంలో ఫ్యాక్టరీ యజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫ్యాక్టరీల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

వడమాలపేట(విజయపురం): మండలంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు వడమాలపేట, మధ్యాహ్నం 3గంటలకు పూడి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏఈ భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 26వ తేదీ అప్పలాయగుంట, ఏఎం పురం 27వ తేదీ పాదిరేడు సబ్‌స్టేషన్లలో సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించబడుతాయని ఆయన తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్టీ సంఘం అధ్యక్షుడు

నగరి: మండలంలోని వీకేఆర్ పురం వద్ద రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై మరణించిన నోమేశ్వరి కుటుంబ సభ్యులకు ఎస్టీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చిన్నారి తల్లిదండ్రులు గోపి బుజ్జిలను కలిసిన ఆయన వారిని ఓదార్చి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అదే ప్రమాదంలో గాయపడిన మహేష్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గైర్హాజరు



జీడీ నెల్లూరు పరీక్ష కేంద్రం వద్ద సీఐ శ్రీనివాసంతి

గంగాధర నెల్లూరు: మండలవ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షలలో మూడు పరీక్ష కేంద్రాలకు గాను 693 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తెలిపారు. మండల కేంద్రంలోని గంగాధరనెల్లూరు పరీక్ష కేంద్రంలో ఒకరు, తూగుండ్రంలో ఇద్దరు, నెల్లెపల్లిలో ఒకరు గైర్హాజరయ్యారని చెప్పారు. గంగాధరనెల్లూరు, నెల్లెపల్లి పరీక్ష కేంద్రాలను సోమవారం సీఐ శ్రీనివాసంతి తనిఖీ చేశారు.

చోదకా.. నీకే హెచ్చరిక

- వాహనాల్లో టైర్ల సంరక్షణే కీలకం
- తరచూ తనిఖీ చేయించుకోవాలంటున్న నిపుణులు
- నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరి
- ఐఎస్ఐ మార్కు ట్యూబ్‌లెస్ టైర్ ఉత్తమం



బంగారుపాళ్యం మొగిలిఘాట్‌లో బస్సును ఢీకొన్న కంటైనర్ (ఫైల్)

కార్వేటినగరం: జిల్లాలో వాహన ప్రమాదాలు పెరుగుతున్నాయి. వీటికి మితిమీరిన వేగం ఓ కారణమైతే, నాణ్యత లేని టైర్లు మరో కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం వేసవిలో ఇలాంటి ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే- టైర్లు పేలడం, పంక్చర్ అవ్వడం.. కొన్ని స్కిడ్ అవ్వడమే కారణంగా తెలుస్తోంది.

- నిపుణుల సూచనలు ఇవే..
- వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా రహదారి బాగా వేడెక్కి కొత్త టైర్ల సైతం పేలే అవకాశాలున్నాయి. కారులో నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలి. ఇది రన్నింగ్‌లో టైర్లను కూల్ చేస్తుంది.
- ప్రయాణానికి ముందు టైర్లలో ఎంత ఎయిర్ ప్రెజర్ ఉందన్నదీ తనిఖీ చేసుకోవాలి. కారు మోడల్‌ను బట్టి ఫ్రంట్ సైడ్ డోర్‌లో వివరాలుంటాయి. సాధారణంగా అయితే ఫ్రంట్ టైర్లలో 35-40, బ్యాక్ టైర్లలో 30 వరకు ఎయిర్ ఉంటుంది.
- తరుచూ వీల్ ఎలైన్‌మెంట్, స్టీరింగ్ బాక్స్ సరిగా ఉందా, లేదా? అనేది తనిఖీ చేసుకోవాలి.
- ఐఎస్ఐ మార్క్ ఉన్న ట్యూబ్‌లెస్ టైర్లు ఉంటే బెటర్..చైనా వీల్స్ వాడకపోతేనే మంచిది. రీ-బటన్ టైర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదు.
- కారుల్లో సీటు బెల్టు ముందున్న వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా పెట్టుకోవాలి. దూర ప్రయాణం చేసేటప్పుడు ఆరు గంటలకు మించి కంటిన్యూ చేయరాదు.
- స్కూళ్లు, కళాశాలల్లో ఇప్పటికే పాతరకం బస్సులు నడుపుతుండటం.. ఈ వేసవిలో అంత శ్రేయస్కరం కాదని నిపుణుల సూచన.

కొన్ని ప్రమాదాలు

- 2024-25లో బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్‌లో బస్సును కంటైనర్ ఢీకొనడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.
- శ్రీరంగరాజపురం మండలంలో గత ఏడాది నాయుడుపల్లె వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొని కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందింది.
- శ్రీరంగరాజపురం మండలం ఇండో-జర్మన్ స్కూల్ వద్ద కారు పంక్చరై చిన్నారిని ఢీకొంది.
- కార్వేటినగరం మండల కేంద్రం సమీపంలో 20వ తేదీ గురువారం టైర్ పేలి ఒక్కసారిగా బస్సు పక్కకు దూసుకెళ్లడంతో ప్రయాణికులు హడలిపోయారు.
- నగరి మున్సిపాలిటీలోని పర్యాటక శాఖ భవనానికి సమీపంలో ఫిబ్రవరి 2 తేదీ బస్సును సైడ్ నుంచి టిప్పర్ లారీ ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు.
- గంగాధరనెల్లూరు మండలంలో పెళ్లి కుమార్తె ఇంటి నుంచి పెళ్లి కుమారుడు ఇంటిలో జరిగే విందుకు వెళుతూ నీవానది వంతెన సమీపం ఆటోను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

నిబంధనలు పాటించాలి



రహదారి భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. కార్లలో ప్రయాణించే వారు నెమ్మదిగా నడుపుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి రాత్రి పూట లారీలు, ట్రాక్టర్లు, వంటి వాహనాలను హైవేపై సిగ్నల్స్ లేకుండా నిలపడం నేరం. వాటి వల్ల ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలి.

–సయ్యద్ అహ్మద్ అజీజ్ , నగరి డీఎస్పీ

ముందుగానే టైర్లు మార్చుకుంటా



నా ఎట్టిగ వాహనానికి ఒకేసారి టైర్లు వేయిస్తాను. కాలపరిమితికి ముందుగానే వాటిని మార్చివేస్తాను. ప్రతి రోజూ టైర్ల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించమని డ్రైవర్‌కు చెబుతాను. వాహనానికి టైర్లు సక్రమంగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు జరగవు.

–పీ.చంద్రమౌళి, ఎంపీడీఓ, కార్వేటినగరం

గాలి చూసుకోవాలి



వాహనాన్ని నడిపే ముందు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా టైర్లలో గాలి చూసుకోవాలి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో టైర్లు పేలి తీవ్ర ప్రమాదాలకు దారి తీయడం మనం చూస్తున్నాం. ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ శాతం కార్లను కొనుగోలు చేస్తున్నాయి. వారంతా ఈ విషయాన్ని తప్పనిసరిగా పాటించాలి

–హనుమంతప్ప, కార్వేటినగరం సీఐ

రేపు ఉపాధి హామీ గ్రామసభ

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామీణ ఉపాధి హామీ బహిరంగ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ శేషగిరిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

విజయపురంలో ....

విజయపురం మండలం కేంద్రం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ బహిరంగ గ్రామసభ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాజేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 మధ్య జరిగిన పనులపై బహిరంగ గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గురుస్వామికి నివాళి

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): మండల పరిధిలోని 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో వెలసిన ఓం శక్తి ఆలయంలో గురుస్వామిగా పూజలు నిర్వహిస్తున్న సీ.రాజా(59) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, వైఎస్ఆర్ సీపీ చిత్తూరు కన్వీనర్ ఎంసీ విజయానందరెడ్డి గ్రామానికి వెళ్లి రాజా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ విజయబాబు, చంద్రయ్యనాయుడు, స్థానిక నాయకులు నివాళులర్పించారు.

విజయపురం ఎస్ఐగా కె.రంగ



విజయపురం: నూతన ఎస్ఐగా కె.రంగ సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన బలరాం జిల్లా ట్రెనింగ్ కళాశాలకు వెళ్లగా ఆయన స్థానంలో వీఆర్‌గా ఉన్న రంగకు ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

వాల్టాకు తూట్లు



ఇంటి నిర్మాణం కోసం వేస్తున్న బోరు

విజయపురం: పర్యావరణాన్ని కాపాడి, భూగర్భ జలమట్టాలు పడిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయకూడదు. బోర్లు తవ్వకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితి వస్తే బోరు బావికి కనీసం 100 మీటర్ల దూరంలో మాత్రమే కొత్త బోరు వేయాలి. కానీ జిల్లాలో పరిస్థితి చూస్తే వాల్టా చట్టం ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే వాగుల్లో ఇసుక తీయడం ఆగడం లేదు విచ్చలవిడిగా బోర్లు తవ్వకాలు కూడా ఆపడం లేదు.

మరింత లోతుగా...

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయనే కారణంగా రైతులు బోర్లు వేస్తుండగా, మరో వైపు ఇళ్ల నిర్మాణాల కోసం యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారీతిన బోర్లు తవ్వేస్తున్నారు. జిల్లాలో వాల్టా చట్టానికి విరుద్ధంగా రోజుకు పాతిక పైగా బోర్లు వేస్తున్నారు. సుమారు 500 నుంచి 800 అడుగు వరకు బోర్ల తవ్వేస్తున్నారు. విచ్చలవిడిగా ఇసుక తీయడం, బోర్లు వేయడం కారణంగా వాతావరణ సమతుల్యం దెబ్బతిని అనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా అధికారులలో ఎలాంటి మార్పు కనిపించలేదు.

భూగర్భ నీటి మట్టం తగ్గడంతో...

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 8 లక్షల ఎకరాల మేర వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం వరి, చెరుకు సాగుకు అధికంగా నీటి అవసరం ఉండడంతో భూగర్భనీటి మట్టం తగ్గిపోయి చాలా చోట్ల బోర్లు తట్టి పోస్తున్నాయి. కొన్నిచోట పూర్తిగా ఎండిపోవడంతో రైతులు మళ్లీ కొత్తగా బోరు బావులు తవ్వుతున్నారు. కొన్నిచోట్ల పాత వాటిని మరింత లోతుకు తవ్వేస్తున్నారు.

భారీగా పెరిగిన ఇళ్ల నిర్మాణం

పట్టణ, పురపాలికలతోపాటు మండల కేంద్రాల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతి ఇంటికి కొత్తగా బోరు వేసిన తరువాతనే పనులు ప్రారంభిస్తున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణంతోపాటు అభివృద్ధి పనుల కోసం బోర్లు తవ్విస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బోర్ల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. జిల్లాలో సాగు కోసం దాదాపు 10 లక్షల బోర్లు వినియోగంలో ఉన్నట్లు అంచనా. ఇటీవల కొత్తగా సుమారు వేయి వరకు బోరు, తవ్వించినట్లు తెలిసింది. వ్యవసాయ, ఇళ్లలోని బోర్లు పరిశీలిస్తే నగరి నియోజకవర్గంలోనే 1.20 లక్షకు పైగా వినియోగిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు నెలకు సుమారు 100 వరకు కొత్త బోరు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఇష్టారీతిన బోర్లు వేయడంతో రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

హుండీ కానుకల లెక్కింపు



ఆలయ హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ ఆలయ హుండీ కానుకలను సోమవారం చిత్తూరు జిల్లా దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం నాయుడు పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 16వ తేదీ నుంచి మార్చి 24 వరకు లెక్కించగా అమ్మవారి హుండీ ఆదాయం రూ.1,20,461 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఏటా ఆలయ హుండీని నాలుగు సార్లు లెక్కించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోలికి వెళ్లవద్దు

శ్రీరంగరాజపురం: బెట్టింగ్ వద్దు విలువైన జీవితమే ముద్దు అని ఎస్ఐ సుమన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బెట్టింగ్‌తో మీ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అవి భూతంలా మనల్ని వెంబడిస్తాయని అన్నారు. ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైందని క్రికెట్ బెట్టింగ్ మాయలో పడితే మీ విలువైన జీవితంతో పాటు మా కుటుంబ భవిష్యత్‌ను కూల్చేస్తుంది అని అన్నారు. క్రికెట్‌తో పాటు ఏ క్రీడలైనా ఆస్వాదించాలి కానీ బెట్టింగ్ మాయలో పడకూడదన్నారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా బెట్టింగ్ గ్యాంగ్ ఉన్నట్లు తెలిసే 9440900692కు తెలియజేయాలన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విభూదితోపాటు నారికేళజలాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అలాగే చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు చేపట్టారు.

రెవెన్యూ సర్వీసెస్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నియామకపత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి

నగరి: డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, చిత్తూరు జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు పి.పన్నీర్ సెల్వం ఎన్నికల అధికారిగా వ్యవహించారు. కమిటీ అధ్యక్షుడిగా నగరి రెవిన్యూ డీటీ జి.ధనుంజయులు, అసోసియేట్ అధ్యక్షుడిగా నిండ్ర తహశీల్దార్ శేషగిరి రావు, ఉపాధ్యక్షులుగా విజయపురం డీటీ టి.అశోక్, కార్వేటినగరం డీటీ ఎ.స్వరూపరాణి, నిండ్ర డీటీ కె.నీలావతి, ప్రధాన కార్యదర్శిగా నగరి ఆర్డీఓ కార్యాలయ డీటీ గౌరి శంకర్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్‌డీఓ కార్యాలయ సిబ్బంది కె.మహేశ్, నగరి తహశీల్దార్ కార్యాలయ ఓఎస్ ఎస్.చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణతేజ, కోశాధికారిగా కార్వేటినగరం ఆర్ఐ వీఎస్. రెడ్డియప్పన్, కార్యనిర్వాహక సభ్యులుగా టి.బాలకృష్ణయ్య, జాఫర్, తేజేష్ నియమితులయ్యారు.

విద్యుత్ సమస్యలపై 45 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఈఈ ఆశీర్వాదం

పుత్తూరు: ఏపీఎస్పీడీసీఎల్ పుత్తూరు డివిజన్ పరిధిలోని వినియోగదారుల నుంచి 45 ఫిర్యాదులు అధికారులకు అందాయి. సోమవారం డివిజన్ పరిధిలోని ఉప కేంద్రాల వద్ద నిర్వహించిన వినియోగదారుల సమావేశాల్లో పలు ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో మోటార్లు వేయడానికి వెళ్లి పాముల కాటుకు గురై మృత్యువాత పడుతున్నామని, అందువల్ల పగటి పూట విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈఈ ఆశీర్వాదం సమాధానం ఇస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అలాగే రైతులు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకొని, తద్వారా కరెంట్ చార్జీలను తగ్గించుకోవాలని సూచించారు. అందిన ఫిర్యాదుల్లో పదింటిని అప్పటికప్పుడు పరిష్కరించారు. మిగిలిన వాటిని క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు, నాగలాపురం డీఈఈలు శంకరయ్య, రమేష్, ఏఈలు జైసాయి, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



హెచ్‌కానిస్టేబుల్‌ని సన్మానిస్తున్న డీఎస్పీ

విజయపురం: బదిలీపై వెళ్లుతున్న ఎస్ఐ బలరాంతోపాటు సిబ్బందిని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సన్మానించారు. సోమవారం విజయపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ బలరాం, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్, కానిస్టేబుల్ విశ్వనాథ్‌లకు పూలమాలలు వేసి సన్మానించారు. ఆయనతోపాటు నగరి రూరల్ సీఐ భాస్కర్ ఉన్నారు.

గ్రామకంతం ఆక్రమణను అడ్డుకోండి

- అంగన్‌వాడీ కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం ఆక్రమించిన టీడీపీ నేత
- కూటమి ప్రభుత్వం రాగానే అధికారుల అండతో భూమి కబ్జా
- ప్రశ్నించిన గ్రామస్తులపై సదరు నేత బెదిరింపులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రామానాయుడుపల్లి గ్రామస్తులు

గంగాధరనెల్లూరు: గ్రామకంతం భూమిని ఆక్రమించుకోవడంతో పాటు అడిగిన వారిపైనే అధికార పార్టీకి చెందిన నేత దౌర్జన్యం చేస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులు తమ గ్రామంలోని ఐదు సెంట్ల గ్రామకంతం భూమిని ఓ వ్యక్తి కుటుంబం ఆక్రమించుకుని అక్రమంగా ఓ షెడ్డు నిర్మాణం చేపట్టింది. తక్షణం ఆక్రమణను అడ్డుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా గ్రామ అవసరాల కోసం గ్రామకంతం భూమిని ఉంచగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూమిని అదే గ్రామంలోని టీడీపీకి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. తాము ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలోని కొందరిపై సంబంధం లేని కేసులు పెట్టించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ భూమిని గ్రామస్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ భవనం కోసం కేటాయించామని, మరికొంత మిగిలిన స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం, మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఉంచామన్నారు. ప్రస్తుతం టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఈ భూమిలో అక్రమంగా ఓ షెడ్డు నిర్మించారన్నారు. అధికారులు చొరవ తీసుకుని వెంటనే ఆక్రమణను తొలగించాలని విన్నవించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రేపు



ప్రత్యేక అలంకరణలో స్వామి

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

క్షయ వ్యాధి నివారణ సామాజిక బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నగరి: క్షయ వ్యాధి నివారణ సామాజిక బాధ్యత అని ఆర్ఎంఓ డాక్టర్ మంజుల అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద నిర్వహించిన ర్యాలీలో ఆమె వైద్యులతోపాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ సామాజిక బాధ్యతన్నారు. టీబీని అంతం చేయడం ప్రజలందరి పంతం కావాలన్నారు. టీబీ ఒక అంటువ్యాధి అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలుకు, అధిక జనాభా, మురికి వాడలలో నివశించే ప్రాంతంలో ఉన్నవారికి ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ఈ వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు లేదా తుమ్మినపుడు తుంపరులు ద్వారా గాలిలో సూక్ష్మక్రిములు ఆరోగ్యవంతులకు వ్యాపిస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం దగ్గినపుడు రక్తం పడడం, తరుచుగా జ్వరం రావడం, ఛాతీలో నొప్పి రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటివి టీబీ లక్షణాలన్నారు. ఈ లక్షణాలున్నవారు ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించి టీబీ వ్యాధికి సంబంధించిన గళ్ల పరీక్షలు చేసుకోవాలన్నారు. వారికి మందులు ఉచితంగా అందిస్తారన్నారు. పోషకాహారానికి నెలకు రూ.1000 అందిస్తారన్నారు. ముందుగానే పరీక్షలు చేసుకోవడంతో టీబీ నుండి జీవితాన్ని రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ, కార్తికేయన్, లోకేష, జయంత్, మహేష్, చిన్ని గణేష్, స్పందన, భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నం, హెడ్ నర్స్ అముదా, టీబీ యూనిట్ స్టాఫ్ పవన్, టీబీ సూపర్‌వైజర్ ప్రేమ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం



వడమాలపేటలో టీబీ ర్యాలీ

వడమాలపే (విజయపురం): క్షయ నివారణ లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి తెలిపారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం వడమాలపేట ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ సామాజిక బాధ్యత, అందరి బాధ్యత అని అన్నారు. టీబీ ఒక అంటువ్యాధి అని, ముఖ్యంగా పేద ప్రజలుకు, అధిక జనాభా, మురికి వాడలలో నివశించే ప్రాంతంలో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దగ్గినపుడు లేదా తుమ్మినప్పుడు తుంపరులు గాలిలో సూక్ష్మక్రిములు వ్యాపించడంతో వ్యాధి ఆరోగ్యవంతులకు సోకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురంలో...



కార్వేటినగరంలో అవగాహన ర్యాలీ

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించా. టీబీ వ్యాధి లక్షణాలు రెండు వారాలకు మించి ఉండడం దగ్గినపుడు రక్తం పడడం, తరుచుగా జ్వరం రావడం, ఛాతీలో నొప్పి రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లక్షణాలు ఉంటే డాక్టర్‌లను సంప్రదించి టీబీ వ్యాధికి సంబంధించిన గల్ల పరీక్షలు చేసుకోవాలని డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. ఈ పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్బరాణేమ్మ, పీహెచ్ఎన్ భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుల్‌కు సన్మానం

పాలసముద్రం: కోర్టు కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బాషా బదిలీ కావడంత ఆయన్ను సోమవారం ఎస్ఐ చిన్నరెడ్డప్ప, సిబ్బంది సన్మానించారు. ఐదేళ్ల పూర్తయిన తర్వాత ఆయన బదిలీ అయినట్టు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవి పాల్గొన్నారు.